క్లుప్తంగా

తైక్వాండో గ్రేడింగ్ పోటీలు



సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులతో కృష్ణప్రసాద్, సునీల్

తెనాలిఅర్బన్: తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో తెనాలిలోని కేఎస్ఆర్ తైక్వాండో అకాడమీలో ఆదివారం గ్రేడింగ్ పోటీలను నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన వారికి ఎల్లో రంగు బెల్టు నుంచి రెడ్-1 బెల్ట్ వరకు పంపిణీ చేశారు. అలాగే సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో డబల్ హార్స్ మినపగుళ్ల మేనేజర్ కృష్ణప్రసాద్, సునీల్, సాంబశివరావు, రామారావు, తైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొని బెల్టులు సాధించిన విద్యార్థులను అభినందించారు.

ఉచిత వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ శ్యామ్‌ప్రసాద్

తెనాలిఅర్బన్: వి-కార్డియాక్ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో తెనాలి మండలం అంగలకుదురు గ్రామంలో ఆదివారం మెగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. హాస్పిటల్ నిర్వాహకులు డాక్టర్ కొత్తమాసు సాంబశివరావు, డాక్టర్ కొత్తమాసు శ్యామ్‌ప్రసాద్, డాక్టర్ విజయవాణిలతో పాటు వైద్యులు డాక్టర్ సురేష్, డాక్టర్ తాజుద్దీన్, డాక్టర్ చందనలు రోగులకు వైద్య పరీక్షలు చేశారు. షుగర్, బీపీ, కీళ్ళ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కోపల్లె, గుడివాడ, సంగంజాగర్లమూడి నుంచి సుమారు 400 మంది ఇక్కడకు వచ్చి వైద్య పరీక్షలు చేయించుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గణేష్ యూత్ కన్వీనర్ వీరవల్లి మురళి వైద్యులను అభినందించి సత్కరించారు.

డాక్టర్ నాయుడమ్మకు నివాళి



తెనాలి: ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ యలవర్తి నాయుడమ్మ జయంతి సందర్భంగా ఆదివారం స్థానిక చెంచుపేటలోని ఆయన కాంస్య విగ్రహానికి పూలమాలల వేసి నివాళులర్పించారు. డాక్టర్ యలవర్తి నాయుడమ్మ సైన్స్ అండ్ టెక్నాలజీ ఫౌండేషన్ చైర్మన్ యడ్లపాటి రఘునాథబాబు, కన్వీనర్ యలవర్తి పవన్‌కుమార్, యడ్లపాటి స్వరూపరాణి తదితరులు డాక్టర్ నాయుడమ్మకు నివాళులర్పించినవారిలో ఉన్నారు. ఈ సందర్భంగా శాస్త్ర, సాంకేతిక రంగాలకు డాక్టర్ నాయుడమ్మ చేసిన సేవలను స్మరించుకున్నారు.

12 వరకు 144 సెక్షన్

తెనాలిరూరల్: టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు అరెస్ట్, రిమాండ్ నేపథ్యంలో తెనాలి పట్టణం, మండలంలో 144 సెక్షన్ నిషేధాజ్ఞలు అమలు చేసినట్టు తహసీల్దార్ కె.రవిబాబు ఆదివారం రాత్రి తెలిపారు. ఆంక్షలు తక్షణమే అమల్లోకి వస్తాయని, 12వ తేదీ అర్ధరాత్రి వరకు అమల్లో ఉంటాయన్నారు. అనుమతులు లేకుండా ఎటువంటి ర్యాలీలు, సభలు నిర్వహించరాదని, నలుగురికంటే ఎక్కువ మంది గుమి కాకూడదని, కర్రలు, రాళ్ల సహా ఎటువంటి ఆయుధాలను కలిగి ఉండకూడదన్నారు. ఇప్పటికే పోలీసు శాఖకు ఖచ్చితమైన ఆదేశాలను జారీ చేశామని, నిబంధనలను అతిక్రమించేవారిపై కఠిన చర్యలుంటాయని తహసీల్దార్ స్పష్టం చేశారు.

సామూహిక కుంకుమార్చనలు



తెనాలిటౌన్: కొత్తపేటలోని శ్రీ అష్టలక్ష్మి ఆలయంలో శ్రావణమాసం ఏకాదశి పునర్వసు నక్షత్రం సందర్భంగా ఆదివారం మహిళలు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. కుమార్ పంప్స్ అధినేత కొత్త సుబ్రమణ్యం పర్యవేక్షణలో సుమారు 100 మంది మహిళలు పూజల్లో పాల్గొన్నారు. అర్చకులు శ్రీరామ చక్రవర్తి పూజలు నిర్వహించారు. తీర్థప్రసాదాలు అందజేశారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు.

పేదలకు అన్నదానం

నగరంపాలెం: స్వచ్ఛ హృదయం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి జీజీహెచ్ వద్ద పేదలకు అన్నదానం చేశారు. ట్రస్ట్ తరఫున ప్రతి నెలలో రెండుసార్లు ఉచిత అన్నదానం చేస్తున్నట్లు చైర్మన్ జొన్నలగడ్డ రాజమోహన్‌రావు తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి సుజాత, అఖిల్‌రాజ్, అభయ్ పాల్గొన్నారు.

ఆత్మగౌరవ పతాక ఐలమ్మ

తెనాలి: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణకు చెందిన వీరవనిత చాకలి ఐలమ్మ బలహీనవర్గాల ఆత్మగౌరవ పతాకగా రాష్ట్ర రజక సంఘాల ఐక్య వేదిక అధ్యక్షుడు పాతపాటి అంజిబాబు అన్నారు. ఐలమ్మ స్ఫూర్తిగా బడుగు, బలహీనవర్గాలు ఆత్మగౌరవంతో సమాజంలో ఎదగాలని, ఐక్యపోరాటాలతో హక్కులను సాధించుకోవాలని సూచించారు. పట్టణ రజక సంఘం ఆధ్వర్యంలో ఆదివారం చాకలి ఐలమ్మ వర్ధంతిని నిర్వహించారు. ఐలమ్మ రజకచెరువు పార్కులోని ఆమె విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. సంఘం పట్టణ అధ్యక్షుడు పెసర్లంక రమణ పర్యవేక్షించగా కౌన్సిలరు వీర్లపాటి విజయలక్ష్మి, కట్టివరపు చిన్న, వెంకటరమణ, మునిపల్లి పార్వతి, హిమాచల రావు, నెప్పలి రాంబాబు, పూర్ణ, రజకసంఘ నాయకులు పాల్గొన్నారు.

బీసీ సంఘం ఆధ్వర్యంలో..

భూమికోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం పోరాడిన ధీశాలి చాకలి ఐలమ్మ స్ఫూర్తిగా బలహీనవర్గాలు తమ హక్కులను సాధించుకోవాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు అన్నారు. చాకలి ఐలమ్మ వర్ధంతి రోజైన ఆదివారం పట్టణ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఐలమ్మ రజక చెరువు పార్కులోని ఆమె విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. పట్టణ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కుర్రా శ్రీను మాట్లాడుతూ భూస్వాములు, జమిందారీ వ్యవస్థలపై తిరుగుబాటు చేసి, వెనుకబడిన కులాలకు అండగా నిలిచిన చాకలి ఐలమ్మ జీవితగాథను అందరూ తెలుసుకోవాలని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో బీసీ నాయకులు తుల్లిమిల్లి చంటి, సతీష్, ఉద్దంటి గిరీష్ పాల్గొన్నారు.



ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేస్తున్న కేసన శంకరరావు



రజకసంఘం ఆధ్వర్యంలో నివాళి..

గ్యాస్ ఆధారిత దహనవాటిక ప్రారంభం

- మనిషి చివరి మజిలీ మహాప్రస్థానం
- సౌకర్యవంతంగా తీర్చిదిద్దటం అభినందనీయం
- రూ.30.50 లక్షలతో ఆధునీకరించటం గొప్ప విషయం
- క్రిమేషన్ ఛాంబర్, మార్చురీ రూమ్ ప్రారంభంలో ఎమ్మెల్యే శివకుమార్



గ్యాస్ ఆధారిత దహనవాటికను ప్రారంభిస్తున్న తుమ్మల గోపీచంద్, పక్కన ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: మనిషి ఎంత ఉన్నతంగా బతికినా చివరి మజిలీ మహాప్రస్థానమేనని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. పేదల దగ్గర్నుంచి సంపన్నుల వరకు జీవనప్రస్థానాన్ని ఎలా గడిపినా శరీరంలోంచి జీవుడు వెళ్లిపోయాక అంతిమంగా చేరుకొనేది శ్మశానవాటికకేనని గుర్తుచేశారు. అలాంటి శ్మశానవాటికలు దీర్ఘకాలంగా నిర్లక్ష్యానికి గురైనట్టు చెప్పారు. మనసున్న పెద్దలు కొందరు పూనుకుని సేవాసమితిగా ఏర్పడి దాతల సహకారం తీసుకుని వాటిని సుందరమైన పార్కులుగా తీర్చిదిద్దటం అభినందనీయం అన్నారు. పాండురంగపేటలోని శ్మశానవాటికలో దాతల సహకారంతో రూ.26 లక్షలతో నిర్మించిన గ్యాస్ ఆధారిత దహనవాటిక (క్రిమేషన్ ఛాంబర్)ను, రూ.4.50 లక్షలతో నిర్మించిన మార్చురీరూమ్‌ను ఆదివారం ప్రారంభించారు. టెరా సాఫ్ట్‌వేర్ ఎండీ తుమ్మల గోపీచంద్ దహనవాటికను ప్రారంభించగా, ఎమ్మెల్యే శివకుమార్ స్విచ్ ఆన్ చేశారు. మార్చురీ రూమ్‌ను 25వ వార్డు కౌన్సిలరు తాడిబోయిన రామయ్య ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి మహాప్రస్థాన సేవాసమితి అధ్యక్షుడు ఢాకా సాంబిరెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహాప్రస్థాన సేవాసమితి గ్యాస్ ఆధారిత దహనవాటికను, శ్మశానంలోనే భౌతికకాయాలను భద్రపరిచేందుకు మార్చురీ రూమ్‌ను నిర్మించటం మరో ముందడుగుగా చెప్పారు. దాతలు డబ్బులు ఊరికే ఇవ్వరంటూ తమ విరాళానికి సార్థకత కలుగుతుందన్న నమ్మకం ఏర్పడితేనే ముందుకొస్తారని చెప్పారు. సేవాసమితిపై అంతటి విశ్వాసం ఉన్నందునే రూ.30 లక్షలకు పైగా నిధులు సమకూర్చినట్టు తెలిపారు. పరిసరాల్లోని ప్రజల వినతి మేరకు తన వంతుగా రూ.25 లక్షలు కేటాయించి ప్రహరీగోడను నిర్మించినట్టు చెప్పారు. సేవాసమితి ప్రధాన కార్యదర్శి జెట్టి శివరామకృష్ణప్రసాద్ స్వాగతం పలికారు. టెరా సాఫ్ట్‌వేర్ ఎండీ తుమ్మల గోపీచంద్, సేవాసమితి ఉపాధ్యక్షుడు మొవ్వా సత్యనారాయణ, కౌన్సిలర్ షేక్ ఇస్మాయిల్, గ్యాస్ చాంబర్ తయారీసంస్థ గ్లోబల్ ఎన్విరో కేర్ ప్రాజెక్ట్ మేనేజరు అర్జిత్‌సింగ్ మాట్లాడారు. ఇదే సభలో విరాళాలు సమకూర్చిన దాతలను ఎమ్మెల్యే శివకుమార్ చేతుల మీదుగా సత్కరించారు. పట్టణ ప్రముఖుడు సూరెడ్డి సూర్యమోహన్, సంస్థ కోశాధికారి తుమ్మల బాపయ్యచౌదరి, సంయుక్త కార్యదర్శులు చదలవాడ శంకరప్రసాద్, ఆర్ఎస్ శంకరరావు, యలవర్తి గంగాధరరావు, బండి సాంబశివరావు, ముద్దాభక్తుని రమణయ్య, కో-ఆప్షన్ మెంబరు వుయ్యూరు రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

పాఠశాల విద్యార్థుల 'స్వచ్ఛత' లఘుచిత్రం

తెనాలి: స్వచ్ఛతా పక్వాడ్‌లో భాగంగా స్థానిక అయితానగర్‌లోని ఎన్ఎస్ఎస్ మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఆదివారం 'స్వచ్ఛత' పేరుతో లఘుచిత్రం తీశారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత వేజళ్ల ఉమామహేశ్వర్ నఫీసా అనే విద్యార్థినిపై క్లాప్ కొట్టారు. చిత్రకళా ఉపాధ్యాయుడు బెల్లంకొండ వెంకట్ దర్శకత్వం వహించారు. స్వచ్ఛతను పాటించినప్పుడే మనిషికి ఆయుష్షు, ఆరోగ్యం రెండూ ఉంటాయని నఫీసా చెప్పగా, విద్యార్థులు ప్లకార్డులతో నినాదాలు చేసిన సన్నివేశాన్ని చిత్రీకరించారు. పెద్దల అడుగుజాడల్లో నడవాలనీ, ఆరుబయట మలవిసర్జన చేయరాదనీ, నీటిని పొదుపుగా వాడాలనీ, తినే ముందు, తిన్న తర్వాత చేతులు శుభ్రం చేసుకోవాలనీ, గాలిని, భూమిని, నింగిని పరిశుభ్రంగా ఉంచుకోవాలనే సందేశంతో ఈ లఘుచిత్రాన్ని తీస్తున్నామని వెంకట్ తెలిపారు.



క్లాప్ కొడుతున్న ఉమామహేశ్వర్

'కాళికా ప్రభాకర్' మృతి



తెనాలి: పట్టణానికి చెందిన ప్రముఖ కళాకారుడు గోనుగుంట్ల ప్రభాకర్(67) ఆదివారం ఉదయం సాలిపేట భిక్షావతి బజారులోని నివాసంలో మృతిచెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. కాళికా వేషంలో ప్రసిద్ధుడైన ప్రభాకర్, పలు రాష్ట్రాల్లో తన అభినయంతో అభినవ కాళిక అన్న బిరుదును పొందారు. శుభకార్యాలు, దేవతా ఊరేగింపుల్లో నడిచి వెళుతుండే కాళిక వేషాన్ని ప్రభాకర్ ఒక మలుపు తిప్పారు. నృత్యంతో కొత్త పుంతలు తొక్కించారు. బీజాక్షరాలు నేర్చుకుని తానే నృత్యాభినయానానికి రూపకల్పన చేశారు. ప్రేక్షకులు ఆదరించటంతో ఇక వెనుదిరిగి చూసుకోలేదు. మూడు దశాబ్దాలు కాళికా వేషధారణలో భక్తులను ఆనందింపజేశారు. వయసు మీదపడటంతో గత కొన్నేళ్లుగా విశ్రాంత జీవనం చేస్తున్నారు.

గంగానమ్మతల్లి ఆలయంలో కొలుపులు

తెనాలిటౌన్: పట్టణ మారీసుపేటలోని ఆర్.ఆర్.నగర్‌లో రెండో లైనులో ఉన్న గంగానమ్మ తల్లి ఆలయంలో ఆదివారం కొలుపులు నిర్వహించారు. శ్రావణమాసం నాలుగో ఆదివారం రోజు ప్రతి ఏడాది కొలుపులు జరుపుతున్నామని పూజారి దేశబోయిన శివయ్య తెలిపారు. గత 40 సంవత్సరాల నుంచి ఆచారం ప్రకారం నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా ఉత్సవ విగ్రహాలకు ఊరేగింపు చేశారు. వివిధ వేషధారణలతో భక్తులు ఊరేగింపులో పాల్గొన్నారు. భక్తులు విశేషంగా పాల్గొని అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ప్రభ ఊరేగింపు చేశారు. కార్యక్రమంలో శివయ్య పూజారి, మైలా హరికృష్ణ, కుమార్, మంగమూరి హైమారావు, ఆనంద కిషోర్, శంకర్, కిరణ్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



ఉత్సవ విగ్రహాలను ఊరేగిస్తున్న నిర్వాహకులు

నేషనల్ బిల్డర్ అవార్డ్స్ ప్రదానోత్సవం

మంగళగిరి: రోటరీక్లబ్ ఆఫ్ మంగళగిరి ఆధ్వర్యంలో కార్పొరేషన్ పరిధిలోని పది ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 16 మంది ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసి నేషనల్ బిల్డర్ అవార్డ్స్ ప్రదానం చేశారు. ఆదివారం నగరంలోని లిటిల్ విలేజ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో రోటరీక్లబ్ ఆఫ్ మంగళగిరి ఉపాధ్యక్షుడు, నేషనల్ బిల్డర్ అవార్డ్స్ ప్రాజెక్ట్ చైర్మన్ ప్రెగడ రాజశేఖర్ మాట్లాడుతూ రోటరీ ఇండియా లిట్రసీ మిషన్ నిబంధనల ప్రకారం శాస్త్రీయ విధానంలో సర్వే చేసి అవార్డు గ్రహీతలను ఎంపిక చేసినట్లు తెలిపారు. కార్పొరేషన్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలకు చెందిన ఎం. విజయమోహనరావు, బి.శ్రీను నాయక్, జేఆర్‌వీ తెర్మండ్, వై.ఉమాదేవి, జి.దుర్గాభవానీ, టి.వాణి, ఎ.లక్ష్మీదేవి, పి.మాధవి, టి.లీలాంజని, కె.శేషుకుమారి, ఎం.సుందరరాజు, కె.కృష్ణ కిషోర్, ఎస్.శ్రీనివాసరావు, ఎస్.భారతి, టి.శ్రీదేవిలకు నేషనల్ బిల్డర్ అవార్డులను ప్రదానం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో రోటరీ డిస్ట్రిక్ట్ 3150 పబ్లిక్ ఇమేజ్ చైర్మన్ బి.శ్రీనివాసరావు, ప్రాజెక్ట్ చైర్మన్ అనిల్ చక్రవర్తి, ఎ.రత్నప్రభాకర్, ఎస్.నాగేశ్వరరావు, వై.వేణుగోపాల్, రోటరీ క్లబ్ కార్యదర్శి గాజుల శ్రీనివాసరావు, మాజీ అధ్యక్షులు డాక్టర్ మాజేటి వంశీకృష్ణ, త్రిపురమల్లు సతీష్ బాబు, కోశాధికారి నూతలపాటి వెంకటేశ్వరరావు, డైరెక్టర్లు అందె మురళి, ఆర్ ధనలక్ష్మి, కె.సుందరయ్య, వి.శ్రీనివాసరావు, బి.వెంకటేశ్వరరావు, ఎస్.రంగనాథ్, సభ్యులు కేవీఎస్ ప్రకాష్, ఆర్.శ్రీనివాసరావు, కె.వేణుగోపాల్ పాల్గొన్నారు.



అవార్డులు అందుకున్న ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులతో రోటరీక్లబ్ ప్రతినిధులు

చిన్నారులకు చెస్ పోటీలు



తెనాలి: సిక్స్ సిగ్మా చెస్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక కవిరాజ పార్కులోని వీజీకే భవన్‌లో చిన్నారులకు చెస్ పోటీలు నిర్వహించారు. నాగసాయిదివ్య, కొత్త లక్ష్మి, హర్షిత్, అందె తన్మయ, సాదిక, దీపిక, దినేష్‌రెడ్డి సూర్యనారాయణ, శశాంక్, మౌళి, ప్రభంజన్‌లు విజేతలుగా నిలిచారు. జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు రవీంద్రబాబు వీరికి ప్రశంసాపత్రాలను అందజేశారు. సిక్స్ సిగ్మా చెస్ అకాడమీ డైరెక్టర్ మోచర్ల నిరంజన్ పర్యవేక్షించారు.

వృద్ధులకు కళ్లజోళ్లు పంపిణీ

మంగళగిరి: నగరంలోని రామనాథం చినకోటయ్య, శివపార్వతమ్మ వృద్ధుల సేవాశ్రమంలో ఆదివారం నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి డీఎస్పీ మహబూబ్ బాషా ముఖ్య అతిథిగా పాల్గొని వృద్ధులకు కళ్లజోళ్లను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ పండుటాకులకు మెండైన సేవ చేస్తేనే జీవితానికి సార్థకత ఏర్పడుతుందని చెప్పారు. వయోవృద్ధుల ఆశ్రమం ఒక వసుధైక కుటుంబమని, పెద్ద వయస్సు వారి అవసరాలు చూస్తూ, అనారోగ్య సమస్యలను పట్టించుకుంటూ ఎలాంటి ఇబ్బంది లేకుండా వృద్ధాప్యంలో ఉన్న వారిని సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని చెప్పారు. కార్యక్రమంలో వృద్ధాశ్రమం అధ్యక్షుడు రామనాథం వెంకటేశ్వరరావు, ఆకురాతి శంకరరావు, దీపాల సాంబశివరావు, పుట్టా ఏడుకొండలు, చెన్నగిరి మంజులాదేవి, ఈమని కామేశ్వరి పాల్గొన్నారు.



వృద్ధులకు కళ్లజోళ్లు పంపిణీ చేస్తున్న డీఎస్పీ మహబూబ్ బాషా

డాక్టర్ శ్రీనివాసరెడ్డికి ఏఎన్‌యూ ప్రతిభా పురస్కారం



గుంటూరు మెడికల్: అత్యంత అరుదైన, క్లిష్టమైన సర్జరీలు, అవేక్ బ్రెయిన్ సర్జరీలు చేస్తూ బాహుబలి సర్జన్‌గా గుర్తింపు తెచ్చుకున్న గుంటూరు బ్రిందా హాస్పిటల్‌కు చెందిన సీనియర్ న్యూరో సర్జన్ డాక్టర్ భవనం హనుమ శ్రీనివాసరెడ్డికి ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ప్రతిభా పురస్కారం లభించింది. సోమవారం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం వ్యవస్థాపక దినోత్సవంలో ఆయన ప్రతిభా పురస్కారం అందుకోనున్నారు.

డాక్టర్ హనుమ శ్రీనివాసరెడ్డి గుంటూరు జీజీహెచ్ న్యూరోసర్జన్‌గా పనిచేస్తూ తనకు వచ్చిన రెండు నెలల జీతాన్ని కోవిడ్ సమయంలో ప్రధాని మంత్రి సహాయనిధి, ముఖ్యమంత్రి సహాయనిధికి విరాళంగా ఇచ్చారు. అనేక మంది పేదలకు ఉచితంగా వైద్యసేవలు అందించి ప్రాణదాతగా నిలిచారు. బ్రెయిన్ సర్జరీల్లో అత్యంత ఆధునిక వైద్య పద్ధతిలో చేస్తూ రికార్డులు సృష్టించారు. అత్యంత అరుదైన బ్రెయిన్ ట్యూమర్లను సైతం గుర్తించి అరుదైన ఆపరేషన్లు చేస్తున్న వైద్యుడిగా రికార్డులకెక్కారు. ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణ స్వీకారాన్ని బ్రెయిన్ ట్యూమర్ రోగికి ల్యాప్‌ట్యాప్‌లో చూపిస్తూ మెలకువ ఉండగానే అరుదైన ఆపరేషన్ చేశారు. ఈ ప్రక్రియ గత నెలలో ఇంటర్నేషనల్ జర్నల్‌లో కూడా ప్రచురితమైంది. వైద్యుడిగా ఆయన సేవలకు గుర్తింపుగా యూనివర్సిటీ 46వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ప్రతిభా పురస్కారం అందజేయనుంది. పేదలకు అందిస్తున్న ఉచిత వైద్యసేవలకుగాను గత నెల ఆగస్టు 15న బెస్ట్ డాక్టర్ అవార్డును జిల్లా ఇన్‌చార్జి మంత్రి ధర్మాన ప్రసాదరావు చేతుల మీదుగా అందుకున్నారు. ఆగస్టు 21న కె.ఎల్.యూనివర్సిటీలో బ్రెయిన్ సర్జరీలపై చేస్తున్న పరిశోధనలకు గాను అత్యంత ప్రతిష్టాత్మకమైన డాక్టర్ సీవీ రామన్ అందుకున్నారు. తాజాగా యూనివర్సిటీ పురస్కారానికి ఎంపికైన డాక్టర్ హనుమ శ్రీనివాసరెడ్డికి బ్రింద హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ వసంత సాయికృష్ణప్రసాద్, సిద్ధార్థ, రేడియాలజిస్ట్ డాక్టర్ జమ్ముల అనిత, ఇతర వైద్యులు, వైద్య సిబ్బంది అభినందనలు తెలిపారు.

ఉచిత అంతర్ముఖ యోగ శిక్షణ

తెనాలిటౌన్: బోసురోడ్డులోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానం ఆవరణలో కల్యాణ మండపంలో భిక్షమయ్య గురూజీ పర్యవేక్షణలో ఈ నెల 12,13 తేదీలలో ఉచిత అంతర్ముఖ యోగ శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఆదివారం తెలిపారు. 12వ తేదీ ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు, 13వ తేదీ ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు మహిళా వ్యక్తిత్వ వికాస యోగ శిక్షణ ఉంటుందన్నారు. వివరాలకు సంపత్ గురూజీ 8919625862, ఎం.వి.రాఘవయ్య 9949844969, ఎం.వి. లక్ష్మి 7989757853లో సంప్రదించాలని కోరారు.

కేబుల్ వైర్లు దగ్ధం



తాడేపల్లిరూరల్: ఉండవల్లి సెంటర్ నాలుగు రోడ్ల కూడలిలోని స్క్రూబిడ్జి వద్ద 11 కేవీ విద్యుత్ స్తంభానికి ఉన్న వివిధ నెట్‌వర్క్‌లకు సంబంధించిన కేబుల్ వైర్లు దగ్ధమయ్యాయి. స్థానికులు నులకపేట విద్యుత్‌శాఖ ఏఈ షణ్ముఖకు సమాచారం ఇవ్వడంతో విద్యుత్ సరఫరా నిలిపివేశారు. వైర్లు రెండు లేయర్లు లేచి పోవడం గమనించి వాటిని మార్చారు. గత వారం రోజుల్లో ఇలా రెండో సారి జరగడంతో విద్యుత్ శాఖ అధికారులు కేబుల్ వైర్లతో ఆందోళన చెందుతున్నారు.

దళితులపై దాడుల్ని తిప్పికొట్టాలి

నెహ్రూనగర్: నేటికీ దళితులపై దాడులు తగ్గలేదని, దళిత రక్షణ చట్టాలు, ప్రత్యేక న్యాయస్థానాలు బాధితులకు న్యాయం చేయలేకపోతున్నాయని దళిత బహుజన ఫ్రంట్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొరివి వినయ్‌కుమార్ పేర్కొన్నారు. అరండల్‌పేటలోని రైల్వే ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమావేశ మందిరంలో ఆదివారం జరిగిన చుండూరు పల్లె వీరుడు కొమ్మెర్ల అనిల్ కుమార్ 32వ సంస్మరణ సభలో ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడారు. ప్రతి గ్రామంలో దళిత పల్లెవీరులు రక్షణ దళాల్ని ఏర్పాటు చేసుకొని దాడుల్ని తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. 32 ఏళ్ల కిందట ఎనిమిది మందిని దారుణంగా చంపిన చుండూరు మారణకాండ కేసులో ఇప్పటికీ హంతకులకు శిక్ష పడకపోవడం, దళితుల ఉనికికే ప్రశ్నార్థకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ముందుగా చుండూరు పల్లె వీరుడు కొమ్మెర్ల అనిల్ కుమార్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు అంగడాల పూర్ణచంద్రరావు, చుండూరు దళిత పోరాట కమిటీ నాయకులు జాలాది మోజెస్, దేవరపల్లి వీరయ్య, చుక్క సుశీలరావు, దళిత బహుజన ఫ్రంట్ నాయకులు బుస్సా రత్నప్రసాద్, కొసనం రాము, భూపతి సునీల్ కుమార్, పొందుగల ప్రకాష్, ఐలా మాణిక్యరావు, సాతులూరి రామాంజయనేయులు, మేళం భాగ్యరావు పాల్గొన్నారు.



అనిల్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దళిత సంఘాల నాయకులు

వైద్యురాలిగా ప్రభావతి సేవలు ఆదర్శనీయం

లక్ష్మీపురం: గుంటూరు జీజీహెచ్ ప్రభుత్వ సమగ్రాసుపత్రి సూపరింటెండెంట్‌గా విశేష సేవలందించిన డాక్టర్ ప్రభావతిని అవగాహన సంస్థ ఆధ్వర్యంలో సత్కరించడం సంతోషదాయకంగా ఉందని కార్యదర్శి కొండా శివరామిరెడ్డి తెలిపారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ఆదివారం ఆరోగ్య సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య రంగానికే తలమానికంగా నిలిచి, ఎటువంటి క్లిష్టమైన జబ్బులనైనా ఇట్టే నయం చేస్తూ వైద్య వృత్తికే డాక్టర్ ప్రభావతి ఆదర్శంగా నిలిచారని తెలిపారు. కరోనా సమయంలో ప్రభుత్వ సమగ్రాసుపత్రి సూపరింటెండెంట్‌గా విరామం లేకుండా పని చేస్తూ, చిరునవ్వుతో రోగులకు ధైర్యాన్ని అందించి సేవలు అందించారని గుర్తు చేశారు. డాక్టర్ ప్రభావతి మాట్లాడుతూ నగర ప్రజల సహాయ, సహకారాలతోనే జీజీహెచ్‌లో సేవలు అందించినట్లు తెలిపారు. అనంతరం సంస్థ సభ్యులు డాక్టర్ ప్రభావతిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు, సీనియర్ సిటిజన్స్, పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

క్షణికావేశంలో నిండు జీవితాల్ని బలి చేసుకోవద్దు

దేశంలో రోజురోజుకూ ఆత్మహత్యలు పెరిగిపోవడం ఆందోళన కలిగిస్తోందని, చిన్న చిన్న సమస్యలకే బెంబేలెత్తి పోయి చేతులారా నిండు జీవితాన్ని నాశనం చేసుకునే స్థితి నుంచి బయటపడాలని ప్రముఖ మానసిక వైద్యులు డాక్టర్ కె.సురేష్‌కుమార్ సూచించారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ఆదివారం ఆత్మహత్య..మానసిక సమస్యే అనే అంశంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్‌కుమార్ మాట్లాడుతూ ఆత్మహత్యలు చేసుకుంటున్న వారిలో 15 నుంచి 45 సంవత్సరాల మధ్య వయస్సు వారే ఎక్కువని తెలిపారు క్షణికావేశంలో నిండు జీవితాల్ని బలి చేసుకుంటున్న వారి వల్ల కుటుంబ సభ్యులు కుదేలై పోతున్నారని చెప్పారు. అనంతరం పలు ఆరోగ్య సూత్రాల్ని వివరించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు పాల్గొన్నారు.



డాక్టర్ ప్రభావతిని సత్కరిస్తున్న అవగాహన సంస్థ సభ్యులు

సేవా కార్యక్రమాల్లో ఆర్యవైశ్యులంతా ముందుండాలి

పాత గుంటూరు: ఆర్యవైశ్యులంతా సేవా కార్యక్రమాల్లో ముందుంటూ పేదల్ని ఆదుకోవాలని ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ గ్లోబల్ అధ్యక్షుడు టంగుటూరి రామకృష్ణ సూచించారు. అరండల్‌పేటలోని ఒక ఫంక్షన్ హాలులో ఆదివారం ఆర్యవైశ్యుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సభకు రామకృష్ణ అధ్యక్షత వహించి మాట్లాడారు. ఆర్యవైశ్యులంతా ఐక్యంగా ఉంటూ సమస్యల్ని పరిష్కరించుకోవాలని తెలిపారు. మహాసభ అధ్యక్షుడు గోపవరపు శివ మాట్లాడుతూ ఆర్యవైశ్యులంతా ప్రపంచ ఆర్య వైశ్య మహాసభలో సభ్యులుగా చేరాలని కోరారు. సభ్యుల సంక్షేమం కోసం మరెన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సదరన్ హోటల్స్ ఎండీ అలపాటి కృష్ణమోహన్, అండ దివ్య, జూలకంటి శ్రీనివాసరావు, గ్రంధి ధనలక్ష్మి పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న టంగుటూరి రామకృష్ణ

అలరించిన సంగీత విభావరి

పాత గుంటూరు: అమరావతి రోడ్డులోని అన్నదాన సమాజ ఆడిటోరియంలో ఆదివారం కళాలయ మెలోడీస్ వ్యవస్థాపకులు ఏ.వి. రత్నాజీ ఆధ్వర్యంలో తెలుగు, హిందీ పాటల 21వ సినీ సంగీత విభావరి ప్రేక్షకుల్ని అలరించింది. అలనాటి పలు చిత్రాల్లోని మధుర గీతాల్ని గాయకులు పి. మొగిలి, ఈ. భారతీరెడ్డి, వి.ఎస్.ఎన్. మల్లేశ్వరరావు, రత్నాజీ, ఎం. రమణి, పి. గాయత్రి ఆలపించారు. కీబోర్డ్ పై కె. రవి, తబలాపై ఎస్. వెంకట్, పాడ్స్‌పై ఎన్. సురేష్ వాయిద్య సహకారంతో కార్యక్రమం హుషారుగా సాగింది.

సామాజిక న్యాయం ముద్దు.. సనాతన ధర్మం వద్దు



నెహ్రూనగర్: తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ తనయుడు ఉదయ్‌నిధి స్టాలిన్ సనాతన ధర్మాన్ని నిర్మూలించాలని, అప్పుడే సమాజం అన్ని రంగాల్లో ముందుకు వెళుతుందంటూ చేసిన వ్యాఖ్యల్ని దళిత ప్రజా సంఘాల నాయకులు సమర్థించారు. లాడ్జి సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆదివారం సామాజిక న్యాయం ముద్దు.. సనాతన ధర్మం వద్దు అంటూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తరతరాలుగా భారతదేశంలో సనాతన ధర్మం అనే ముసుగులో మను వాదాన్ని కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. రెండు, మూడు వర్గాల వారిని పైస్థాయిలో నిలిపేందుకే ఇది ఉపయోగపడుతోందని విమర్శించారు. 85 శాతంగా ఉన్న ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలను అనేక రూపాల్లో వేధింపులకు గురిచేసిన మను వాదాన్ని బలపరుస్తున్న సనాతన ధర్మాన్ని శాశ్వతంగా నిర్మూలించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు పాగళ్ల ప్రకాష్, డాక్టర్ మద్దు అంకయ్య, నల్లపు నీలాంబరం, సుజాతరావు, నాయకులు పాల్గొన్నారు.

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

90102 23706 (తెనాలి, వేమూరు, రేపల్లె)
99122 25447 (తెనాలి)

Office mail : sakshigntadvt@gmail.com